క్లుప్తంగా

తాగునీటి బోరు ప్రారంభం


తాగునీటి బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని జై ఆంధ్రాకాలనీ–వాడ వీధి దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు నాయకులు గూడెల కృష్ణ, పుక్కల కృష్ణ, రాజారావు, కనక రాజు, ధర్మ, ప్రదీప్, లలిత తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న బెహరా విజయ చైతన్య

గోపాలపట్నం: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమని బెహరా విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ బెహరా విజయ చైతన్య అన్నారు. నరవలోని బెహరా విద్యా సంస్థలో బుధవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు పాటించక పోతే దీర్ఘకాలిక సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బాణాల తరుణ్, ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోవిందరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఫిజియోథెరపీ సేవలు


లక్ష్మీనగర్ భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం: లక్ష్మీనగర్‌లోని భవితా సెంటర్‌లో ఫిజియో థెరపీ సేవలను పునః ప్రారంభించినట్టు ఎంఈవో దివాకర్ తెలిపారు. గతంలో ఈ సెంటర్‌కు వచ్చి ఫిజియోథెరపీ చేసే వారని అయితే థెరపిస్టు అందుబాటులో లేక పోవడంతో సేవలు నిలిచి పోయాయన్నారు. దీన్ని బుధవారం ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతీ మంగళవారం ఫిజియో థెరపిస్టు అందుబాటులో ఉంటారని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంగసాయి కళాపీఠం ప్రారంభం


రంగసాయి కళాపీఠం పోస్టర్ ఆవిష్కరించిన డాక్టర్ రమణమూర్తి

సీతమ్మధార : కళారంగంలో నిత్యం సేవలు అందిస్తున్న బాదంగీర్ సాయి బుధవారం రంగసాయి కళాపీఠం సంస్థను స్థాపించారు. ద్వారకానగర్‌లోని కళా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ పి.వి.రమణమూర్తి పోస్టర్ ఆవిష్కరించి, సంస్థను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాదంగీర్ సాయి 36 సంవత్సరాలుగా కళారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు.కళాపీఠం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఏదో తెలియని శక్తి ముందుకు నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో రంగస్థల నటి శివజ్యోతి, రంగసాయి సంస్థ సభ్యులు ఆదినారాయణ, వియ్యపు రామకృష్ణ, జమ్మా చినబాబు పాల్గొన్నారు.

నాటకానికి జీవం

ఆ కాలనీవాసులు వినూత్నంగా ఆలోచించారు. అంతరించిన పోతున్న కళను బతికించాలని కంకణం కట్టారు. ఆధునిక పోకడలు, పాశ్చాత్య సంస్కృతి వైపు పరుగుపెడుతున్న యువతకు సంప్రదాయ కళను పరిచయం చేయాలని నిర్ణయించారు. దానికి వినాయక ఉత్సవాలను వేదికగా చేసుకున్నారు. నాటకాల్లో ఉన్న మాధుర్యాన్ని చాటిచెప్పారు. నాటకంతో పాటు కోలాటం వంటి వాటిలో స్థానిక యువత, చిన్నారులకు శిక్షణ ఇవ్వడం ద్వారా కళను బతికించాలని ప్రయత్నం మొదలు పెట్టారు. దీనికి ఆ కాలనీ పెద్దల నుంచి మద్దతు లభించింది.

- స్థానిక కళాకారులకు ప్రోత్సాహం
- వినూత్నంగా ఆలోచించిన తారకరామ ఎన్‌క్లేవ్ వుడా కాలనీ వాసులు
- నేటి తరానికి నాటకాన్ని పరిచయం చేస్తున్న కాలనీ పెద్దలు


ఏక్ దిన్ కా సుల్తాన్ నాటకంలో ఒక సన్నివేశం


ఆసక్తిగా చూస్తున్న కాలనీ వాసులు

గోపాలపట్నం: అంతరించిపోతున్న నాటక రంగాన్ని బతికించుకునేందుకు ఎన్ఏడీ సమీప తారకరామా ఎక్లేవ్ వుడా కాలనీ వాసులు నడుంబిగించారు. నాటకాన్ని నేటి తరానికి పరిచయం చేయాలని కాలనీ పెద్దలు కృషి చేస్తున్నారు. చిన్నారులకు సైతం నటనపై ఆసక్తి పెంపొందించేలా చిన్నచిన్న స్కిట్లు వేయించి ప్రోత్సహిస్తున్నారు. అంతే కాకుండా కాలనీ వాసుల ఆసక్తిని బట్టి కోలాటాలు, సాంప్రదాయ నృత్యాలు నేర్పిస్తున్నారు. స్థానిక కళాకారులనే ప్రోత్సహిస్తున్నారు. ఆ కళాకారులు మరికొంత మందికి శిక్షణ ఇచ్చిన కళను బతికించే ప్రయత్నం చేస్తున్నారు. వారి ప్రయత్నానికి గణపతి నవరాత్రులు నాంది పలికాయి.

తొలి ప్రయత్నం...
వినాయక చవితి సందర్భంగా ఏక్ దిన్ కా సుల్తాన్ నాటకాన్ని ప్రదర్శించారు. అందులో ఉన్న మాధుర్యాన్ని కాలనీ వాసులకు పరిచయం చేశారు. ఇలాంటి నాటకాలు తామూ వేస్తామని యువకులు ఆసక్తి చూపారని కాలనీ పెద్దలు చెబుతున్నారు. ఇకపై అన్ని పండగలకు ఇలా నాటికలు ప్రదర్శించాలని నిర్ణయించారు.

అంతా కలిసి..
ఏటా నిర్వహించే పలు పండగలకు కాలనీ వాసులంతా కలుస్తారు. ఇంటి యజమానులు ఎక్కడ ఉన్నా ఇలా పండగలకు వస్తుంటారు. సరదాగా వారం రోజులు ఇక్కడే ఉండి ఆనందాలు పాలు పంచుకుని వెళ్తారు. ఇది ఇక్కడి సాంప్రదాయంగా మార్చుకున్నారు. దీనిలో భాగంగా ఆసక్తి ఉన్న వారికి నాటకాలపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

నాటకాన్ని పునఃపరిచయం చేస్తున్నా



యుక్త వయసులో నాకాలు వేశాను. ఆ తర్వాత బాధ్యతలు పెరగడంతో కొంత మేర దూరమయ్యాను. అయితే నాలో ఉన్న ఆసక్తి తగ్గలేదు. అందుకే కాలనీ వాసుల చేత జంధ్యాల రచించిన ఏక్‌దిన్ కా సుల్తాన్ నాటకాన్ని ప్రదర్శించాం. ఇది చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. మా కాలనీ వారినే కళాకారులుగా తీర్చి దిద్దుతున్నాను. యువత కూడా ఆసక్తి చూపిస్తున్నారు.
– గండిపటాల తాతాజీ, కాలనీ వాసి, నాటకం డైరెక్టర్

తొలిసారి స్టేజిపై..



నేను రైల్వే ఉద్యోగిని. ఈ కాలనీలో ఉంటున్నాను. ఇక్కడి వారంతా కుటుంబంలా ఉంటున్నాం. తాతాజీ నాటకం వేద్దామంటే సరే అన్నాను. కేవలం నెల రోజుల్లోనే నాటకాన్ని బాగా ప్రదర్శించగలిగాం. పాతశాల దశలో వేశాను. తొలిసారిగా స్టేజ్‌పై వేశాను. ప్రేక్షకులంతా మంచి ఆదరణ చూపించారు.
– డి. కామేశ్వరరావు, హెడ్ క్లర్క్ క్యారెక్టర్

నేటి తరానికి పరిచయం



ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. ఏక్‌దిన్‌కా సుల్తాన్ నాటకం వేయడం చాలా సంతోషంగా ఉంది. గతంలో నాటకాలు వేసేవాడిని. మళ్లీ ఇపుడు నాటకాలు వేసే అవకాశం దక్కింది. పాతతరం నాటకాలు ఈ తరానికి పరిచయం చేయడమే మా ప్రయత్నం. కాలనీలో యువకుల చేత నాటకాలు వేయించి వారిలో ఆసక్తి పెంచుతాం.
–గణపతిరావు, నాటకంలో ప్రధాన పాత్రధారి

పిల్లల్లో కళలపై ఆసక్తి పెంచాలని..



సత్యసాయి బాల విహార్ ద్వారా పిల్లల్లో కళలపై ఆసక్తి కలిగిస్తున్నాను. వారి ఆసక్తిని బట్టి కోలాటం, నాటకాలు, డ్యాన్సు నేర్పిస్తున్నాను. దాని వల్ల పిల్లల్లో ఉత్సాహం, విజ్ఞానం పెరుగుతుంది. ఈ ప్రయత్నం ఎంతో ప్రయోజనకంగా ఉంది.
– ఎంవీ భారతి,స్థానికురాలు

ప్రోత్సాహం అందిస్తా..



చాలా ఏళ్ల తర్వాత నాటకాన్ని చూశాను. చాలా బాగుంది. నాటకాలు అంతరించి పోతున్న తరుణంలో ఈ విధంగా మళ్లీ ఆ రంగాన్ని ప్రోత్సహించే విధంగా తారకరామ ఎక్లేవ్ కాలనీ వాసులు చేస్తున్న ప్రయత్నం మెచ్చుకోదగ్గది. నా వరకు వీరికి ఏవిధమైన ప్రోత్సాహం కావాలన్నా చేస్తాను. మంచి ప్రయత్నాన్ని అందరూ స్వాగతించాలి.
–జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల చెంతకు

గోపాలపట్నం: విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన వ్యక్తి తప్పిపోయి కోరాపుట్ విశాఖ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడన్న సమాచారంతో రైల్వే పోలీసులు తనిఖీ చేసి ఆ వ్యక్తిని పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి పాకీ వీధికి చెందిన జలగాదుగుల వెంకటరమణ అదృశ్యమైనట్టు బొబ్బిలి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. అయితే బుధవారం కోరాపుట్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. సిఫ్ట్ ఆఫీసర్‌గా ఉన్న కె. అనితకు సమాచారమందించారు. ట్రెన్‌లో తనిఖీలు చేపట్టి సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద పట్టుకున్నారు. ఏఎస్ఐ కేఆర్‌కే రావు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి అప్పగించారు. రైల్వే పోలీసులు చూపిన చొరవకు వెంకటరమణ బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు పరామర్శ


కొండ చరియలు విరిగి పడిన ప్రాంతంలో స్థానికులతో మాట్లాడుతున్న భాస్కరరావు

గోపాలపట్నం: భారీ వర్షాలకు రామకృష్ణానగర్‌లో కొండ చరియలు విరిగి పడిన ప్రాంతంలోబుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు పర్యటించారు. స్థానికులతో మాట్లాడి ఘటన జరిగిన విధానంపై ఆరా తీశారు. అనంతరం లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ప్రాథమిక పాఠశాలలో ఉంటున్న బాధితులను పరామర్శించారు. ఆయన వెంట 91వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు ఉన్నారు.

సుప్రీం తీర్పును పునః సమీక్షించాలి


పారిశ్రామిక ప్రాంతంలో ర్యాలీ చేస్తున్న దళితులు

సింథియా: ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని కోరుతూ పారిశ్రామిక ప్రాంత దళితులు బుధవారం జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ ఏడుగుళ్ల సెంటర్ వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దళిత రత్న మాటూరి చిన్నారావు మాట్లాడుతూ ఏబీసీడీగా విభజిస్తే దళితుల్లో ఐక్యత దెబ్బతింటుందన్నారు. ర్యాలీ ఏకేసీకాలనీ, చింతల్లోవ, అంబేడ్కర్‌కాలనీ, జనతాకాలనీ, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ, జింక్‌గేటు, ఆర్టీసీ డిపో, మీదుగా అజంతా సినిమా హాల్ దగ్గర ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకూ సాగింది. కార్యక్రమంలో దళిత నాయకులు గుడాల ఈశ్వరరావు, తంతటి సంపత్, గుడాల బాబూరావు, పునుగు రమణ, గుడాల రాంబాబు, గోగు ప్రసాద్, పెయ్యిల సిద్ధార్థ, సబ్బవరం శ్రీను, ఎం. హనుమంతరావు, మధు, చల్లా రామారావు, పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ అధికారి రాధికకు సత్కారం


హెచ్ఆర్ అధికారి రాధికను సత్కరిస్తున్న నాయకులు


ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ డీజీఎం డాక్టర్ దాసరి రాధికను వివిధ సంఘాల నాయకులు సత్కరించారు. నేషనల్ స్టీల్ అసోసియేషన్ ఇటీవల ఆమెకు న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మక జెండర్ డైవర్సిటీ అవార్డు అందజేసింది. ఈ సందర్భంగా బుధవారం నాయకులు ఆమెను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఆర్ అధికారిగా డాక్టర్ రాధిక అందించిన సేవలకు గుర్తింపుగా జాతీయ స్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో విభాగం జీఎం డాక్టర్ పి. రవికుమార్, వివిధ సంఘాలు, అసోసియేషన్ల నాయకులు కారు రమణ, బయ్యే మల్లయ్య, బి. తౌడన్న, ఎస్. సత్యనారాయణ, అప్పలరాజు, టి. కనకరాజు, త్రిలోకనాథ్, కె.వి. రత్నం, శేషకుమార్, రాథోడ్, మోహన్‌బాబు పాల్గొన్నారు.

ఉక్కును కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే


దీక్షా శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు మాటూరి శ్రీనివాసరావు, బి.అప్పారావు, శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షా శిబిరంలో బుధవారం వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఉక్కును కాపాడుతామని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని, ఆ వాగ్దానాలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. విశాఖలోని లక్షల కోట్ల విలువైన భూములపై అదాని, అంబానీలు కన్నేశారని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో వాటిని కొట్టేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వరసాల శ్రీనివాసరావు, అప్పారావు, కోరాడ వెంకటరావు, కామేశ్వరరావు, వైఎల్‌నాయుడు, కనకరాజు, వి.అప్పలరాజు, కె.పెంటారావు పాల్గొన్నారు.

'మేడ్ ఫర్ ఈచ్ అదర్స్' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బేతవోలు రామబ్రహ్మం, తదితరులు

సీతంపేట : ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు రచించిన హాస్య కథల సంపుటి 'మేడ్ ఫర్ ఈచ్ అదర్స్' పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రముఖ రచయిత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్యాన్ని సృష్టించడం కత్తిమీద సాములా చాలా కష్టమైన ప్రక్రియ అని, అటువంటి ప్రక్రియలో ద్విభాష్యం రాజేశ్వరరావుది అందెవేసిన చేయి అని ప్రశంసించారు. హాస్య కథలు చాలా క్లుప్తంగా, గుట్టుగా, పాఠకులు ఆస్వాదించే విధంగా చెప్పాల్సి ఉంటుందన్నారు. అలాంటి గొప్ప కథా రచయిత గతంలో రచించిన 'చెట్టంత మనిషి' కథా సంపుటి చదివానని, ఎంతో అద్భుతంగా రాశారన్నారు. ప్రతి కథలో చివరన మంచి సందేశం ఇవ్వడం తనకు నచ్చిందన్నారు. విశాఖపట్నంకు ద్విభాష్యం రాజేశ్వరరావు ఆస్థాన కథా రచయిత అని కొనియాడారు. అటువంటి గొప్ప కథా రచయిత రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కొచ్చెర్లకోట జగదీష్ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో కథా రచయిత జె.పి.శర్మ, వోలేటి పార్వతీశం, మద్దాళి రఘురాం, పలువురు రచయితలు, సాహితీవేత్తలు, కవులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఉండాలని, అభ్యర్థుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, అభ్యర్థుల హెవీ వెహికల్ డ్రైవింగ్ ఎల్ఎల్ ఆర్ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు ఈ నెల 23లో గా ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9491962841 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రాఫిక్ డిజైనింగ్‌లో ఉపాధి అవకాశాలు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల సైన్స్ విభాగం, జేసీఐ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు గ్రాఫిక్ డిజైనింగ్‌పై వివరిస్తూ, ఈ రంగంలో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. గ్రాఫిక్ డిజైనింగ్‌లో అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతపై అవగాహన పెంచుకుని, తద్వారా నైపుణ్యాభివృద్ధి సాధించాలని విద్యార్థినులకు సూచించారు. 10 జి మైండ్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఎండీ బలరాం వివిధ గ్రాఫిక్ డిజైనింగ్ సాఫ్ట్‌వేర్స్ గురించి వివరిస్తూ ఏఐ టూల్స్‌ను ఎలా ఉపయోగించాలో తెలిపారు. అనంతరం కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డి.అరుణపద్మ గ్రాఫిక్ డిజైనింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మంజులను సత్కరించారు. కార్యక్రమంలో జేసీఐ విశాఖపట్నం సెనేటర్ చంద్రశేఖర్, సెక్రటరీ ఆర్.కార్తీక్, ప్రవీణ, కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి.సంతోషి, అనూష, ఫిజికల్ డైరెక్టర్ ఆర్. కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన వంతెన పైభాగం

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వంతెన పైభాగం కూలేందుకు సిద్ధంగా ఉండడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. కాన్వెంట్ జంక్షన్ నుంచి పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లే పురాతన వంతెన రహదారిలో రైల్వే ట్రాక్ ప్రాంతంలో వంతెనకు ఇరువైపులా నిర్మించిన సిమెంటు కట్టడాలు శిథిలావస్థకు చేరాయి. ఎస్సార్ కంపెనీ వద్ద గల కట్టడమైతే ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉంది. భారీ వాహనాలు వెళ్లే సమయంలో రాళ్లు వంతెనపై పడుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. బ్రిడ్జి పడిపోయే స్థితిలో ఉందని చెబుతున్నా అధికారులు స్పందించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

జీవీఎంసీ కార్యాలయంలో అన్నసమారాధన


అన్నసమారాధన ప్రారంభిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. అన్నసమారాధనను ప్రారంభించిన జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ గణేశుని ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. ఉద్యోగులందరూ అన్న సమారాధన చేపట్టడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమం నిర్వహించిన జీవీఎంసీ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంవీడీ ఫణిరామ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా జీవీఎంసీ ఉద్యోగులు కలిసి వినాయక చవితి పండగ ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం ఉద్యోగులు గరిడీ, కోలాటం మధ్య నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డీసీఆర్ శ్రీనివాసరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

గోపాలపట్నం: బాలికతో ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన 91వ వార్డు పాత గోపాలపట్నంలో చోటుచేసుకుంది. గోపాలపట్నం సీఐ సురేష్ తెలిపిన వివరాలు.. పాత గోపాలపట్నం ఎస్సీ కాలనీకి చెందిన బాలిక అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అతడు చిప్స్ ప్యాకెట్ ఇచ్చాడు. చిప్స్ తిన్న బాలిక వాంతులు చేసుకుంది. ఇంటికి వచ్చాక కళ్లు కూడా తిరుగుతున్నాయని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు స్థానికంగా 30 పడకల ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. కాగా ఆ వ్యక్తి తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని పోలీసులకు బాలిక తెలిపింది. గోపాలపట్నం పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ప్రచారం అవాస్తవం
ఈ ఘటనపై సోషల్ మీడియా జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. అతడు అసభ్యకరంగా తాకినట్టు బాలిక చెప్పిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

వ్యాధుల కట్టడికి ప్రత్యేక చర్యలు

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: సీనజల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. అక్కిరెడ్డిపాలెం, సిద్ధేశ్వరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కిరెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను, మలేరియా, డెంగ్యూ, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితాను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది అంతా ఎఫ్ఆర్ఎస్ హాజరు విధిగా వేయాలని, లీవ్ రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్ తప్పని సరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్లు రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి ఐరన్ మాత్రలు అందించాలన్నారు. సిసెక్షన్ ప్రసవాలు నివారించాలని, ముఖ్యంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ శత శాతం పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం కాబట్టి కీటక జనిత వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఉమాపతి, డీపీఎంవో బి.నాగేశ్వరరావు, పట్టణ కేంద్ర ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జనగణనతోనే బీసీల అభివృద్ధి సాధ్యం


నినాదాలు చేస్తున్న బీసీ సంఘ నాయకులు

సీతంపేట : దేశంలో బీసీలు అభివృద్ధి చెందాలంటే బీసీల జనాభా ఎంత అనేది తెలియాలని ఆ సంఘ రాష్ట ఉపాధ్యక్షుడు, శెట్టి బలిజ రాష్ట్ర నాయకుడు కట్టా మల్లేశ్వరరావు అన్నారు. బహుజన సమాజ్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాద్ అధ్యక్షతన స్థానిక పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విశాఖ జిల్లా బీసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా భారతదేశంలో బీసీల జనాభా ఎంత అనేది తెలియకుండా ఉందన్నారు. జనగణనకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో, అసెంబ్లీలో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 139 బీసీ కులాలు ఉన్నప్పటికీ 111కి పైగా కులాలకు చట్టసభల్లో ఒక్క అవకాశం కూడా ఇప్పటి వరకు రాలేదని, దీనిని బీసీలంతా గమనించాలన్నారు. ఓబీసీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగం గురించి యువతకు తెలియజేసేలా పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని కోరారు. సమావేశంలో బీసీ నాయకులు డాక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు, డాక్టర్ పి.బి.చిట్టి, మహేష్ గౌడ్, రొట్ట శ్రీను, పి.ఎస్.రామారావు, అతుకంశెట్టి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.